మన ఊరు-మన బడితో మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు

# విద్యారంగంలో విప్లవాత్మక ప్రగతి



సర్వాంగ సుందరంగా పరిగి మండలం కాళ్ళాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల

- కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య
- కార్పొరేట్ స్థాయిలో రూపుదిద్దుకున్న సర్కారు బడులు
- విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంచేందుకు తొలిమెట్టు కార్యక్రమం
- ప్రభుత్వ స్కూళ్లలో మారిన మధ్యాహ్న భోజనం మెనూ
- నేటి నుంచి ప్రభుత్వ స్కూళ్లలో రాగి జావా
- పూర్తైన స్కూళ్లు నేడు ప్రారంభం

వికారాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యాభివృద్ధి కోసం ఎన్నో పథకాలను అమల్లోకి తీసుకువచ్చారు. కేజీ టూ పీజీ ఉచిత నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతూ మందుకెళ్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. సర్కారు బడుల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతనివ్వడంతోపాటు కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా సర్కార్ స్కూళ్లను తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. గతేడాది నుంచి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలను ప్రారంభించడం, నాణ్యమైన విద్యనందించడంతోపాటు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ యూనిఫాంలను కూడా అందిస్తుండడం వంటి కార్యక్రమాలను గత తొమ్మిదేండ్లుగా చేపడుతూ వస్తున్నది. అన్ని వసతులతో కూడిన గురుకుల పాఠశాలలను అందుబాటులోకి తీసుకువచ్చిన రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత, జడ్పీ పాఠశాలల బలోపేతానికి కూడా సర్కారు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మన ఊరు-మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు విద్యా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

### ప్రభుత్వ స్కూళ్లలో సమూల మార్పులు

మన ఊరు-మన బడి కార్యక్రమంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. సర్కారు స్కూళ్లలో సకల వసతులు కల్పించడంతో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా రూపుదిద్దుకున్నాయి. మొదటి విడతలో ఎంపిక చేసిన స్కూళ్లలో మండలానికి, మున్సిపాలిటీకి రెండు చొప్పున బడులను ఎంపిక చేసి సంబంధిత స్కూళ్లలో అవసరమైన మౌలిక సదుపాయాలను గుర్తించి పనులు పూర్తి చేశారు. జిల్లావ్యాప్తంగా 41 స్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పన పనులు పూర్తి కాగా, ఇప్పటికే 10 స్కూళ్లను ప్రారంభించగా, మరో 23 స్కూళ్లను నేడు జిలాల్లోని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ప్రారంభించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో తాగునీరు, ఫర్నిచర్, మరుగుదొడ్లు, విద్యుత్తు, గ్రీన్ చాక్‌బోర్డులు, పెయింటింగ్, ప్రహరీలు, కిచెన్ షెడ్‌లు, శిథిలమైన తరగతి గదుల నిర్మాణం, మరమ్మతులు, డిజిటల్ విద్యకు అవసరమైన ఏర్పాట్లు, ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాళ్లను సంబంధిత ప్రభుత్వ పాఠశాలల్లోకి అందుబాటులోకి తీసుకువచ్చారు. మొదటి విడతలో ఎంపిక చేసిన స్కూళ్లలో ఉన్నత పాఠశాలలు-111, ప్రాథమికోన్నత పాఠశాలలు-40, ప్రాథమిక పాఠశాలలు-220 ఉన్నాయి. ఇప్పటివరకు 41 స్కూళ్లలో దాదాపు పనులన్నీ పూర్తయ్యాయి. మిగతా స్కూళ్లలో 50 శాతానికిపైగా పనులు పూర్తి కావడంతోపాటు ఆయా స్కూళ్లలో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు అంచనాలు పూర్తయిన 371 స్కూళ్లలో మౌలిక సదుపాయల పనులను చేపట్టేందుకు ఇప్పటివరకు జిల్లాకు రూ.144 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది.

### గత సంవత్సరం ఆగస్టు 15 నుంచి 'తొలిమెట్టు' అమలు

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలో చదివే విద్యార్థుల్లో కనీస అభ్యసనా సామర్థ్యాలను పెంచేందుకు విద్యాశాఖ గత విద్యా సంవత్సరం ఆగస్టు 15 నుంచి తొలిమెట్టు(ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని అమలు చేసింది. జిల్లాలోని 72 మంది రిసోర్స్ పర్సన్లకు ఈ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చి అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని 767 ప్రాథమిక పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేయగా మంచి ఫలితాలు వచ్చాయి.

### డిజిటల్ బోధన

మొదటి విడతలో ఎంపిక చేసిన 111 ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాన్ని పెంచడానికి ఈ విద్యా సంవత్సరం నుంచి డిజిటల్ విధానంలో పాఠాలు బోధించాలని నిర్ణయించింది. ఇందుకుగాను మల్టిఫుల్ ఫీచర్స్ డిజిటల్ స్క్రీన్ డివైజ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. 75 అంగుళాలున్న స్క్రీన్లను 8, 9, 10 తరగతులకు ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేస్తున్నారు. వీటికి ఇంటర్‌నెట్, వైఫై, మొబైల్ హాట్‌స్పాట్ సదుపాయం కల్పిస్తారు. తద్వారా విద్యార్థులకు కావాల్సిన ఆడియో, వీడియోలు, త్రీడీ ఇమేజ్‌లను గూగుల్ సెర్చ్, యూట్యూబ్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం ఉంటుంది. ఈ స్క్రీన్‌ను మూసివేస్తే గ్రీన్ చాక్ బోర్డులా కూడా వినియోగించుకునే అవకాశం ఉంది. మొబైల్ నుంచి ఈ డివైజ్‌కు వీడియోలు కూడా పంపించుకోవచ్చు.

### పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

పదో తరగతిలో ప్రతిభ చూపిన పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో ఇంటర్మీడియట్ విద్యను ఉచితంగా అందిస్తున్నది. ఈ పథకం కింద ఆయా కులాల రిజర్వేషన్ ఆధారంగా కేటాయించిన సీట్లను భర్తీచేస్తారు. ఈ పథకం ద్వారా జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ పథకం కింద ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రూ.35 వేలు ఫీజు, పాకెట్ మనీగా ఏడాదికి రూ.3 వేలు అందిస్తారు. దీంతోపాటు ప్రవేశం పొందిన కళాశాలలోనే ఉచిత విద్యతో పాటు భోజనం, వసతి కూడా కల్పిస్తారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2 లక్షలు, బీసీ, మైనార్టీ, ఈబీసీలైతే రూ.లక్షకు మించనివారు, విద్యార్హతలకు సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన పదో తరగతి పరీక్షల్లో 7.0-10 జీపీఏ మార్కులు సాధించి ఉండాలి.

### ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, రెండు జతల యూనిఫాంను అందజేస్తుండగా ఈ ఏడాది నుంచి ఉచితంగా నోటు పుస్తకాలను కూడా పంపిణీ చేయనున్నది. ఈ విద్యా సంవత్సరం పాఠశాలలు తెరిచిన మొదటి రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను, యూనిఫాంను అందజేశారు. త్వరలో నోటు పుస్తకాలను కూడా పంపిణీ చేయనున్నారు.

### మారిన మధ్యాహ్న భోజనం మెనూ

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేసే మధ్యాహ్న భోజన పథకం మెనూను ప్రభుత్వం ఈసారి మార్చింది. వారంలో ఒకరోజు వెజిటబుల్ బిర్యానీ, ఒక రోజు కిచిడీ అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదేవిధంగా దూర ప్రాంతాల నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు ఉదయం పూట ఏమీ తినకుండా వస్తారన్న ఉద్దేశంతో ఉదయం రాగిజావను అల్పాహారంగా అందించాలని నిర్ణయించింది. నేడు విద్యా దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

### జిల్లాకు 33 గురుకుల పాఠశాలలు

కేజీ టూ పీజీ ఉచిత నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం జిల్లాలో గత తొమ్మిదేండ్లలో 33 ప్రభుత్వ గురుకుల పాఠశాలలను ప్రారంభించింది. సంబంధిత గురుకుల పాఠశాలల్లో ఇంటర్ వరకు నాణ్యమైన విద్యనందిస్తున్నారు. ఈ పాఠశాలల్లో ఇప్పటివరకు 15,491 మంది పేద విద్యార్థులకు అవకాశం కల్పించారు. గురుకుల పాఠశాలల్లో చదివే ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం రూ.1.30 లక్షలను ఖర్చు చేస్తున్నది.



కాళ్ళాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో తరగతి గది

## రూ.97కోట్ల వ్యయంతో 448 పాఠశాలలకు పనులు




ప్రారంభోత్సవానికి సిద్ధంగా కందవాడ ప్రాథమిక పాఠశాల

రంగారెడ్డి, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : 'ఒకప్పుడు అరకొర వసతులతో ప్రభుత్వ పాఠశాలలు కునారిల్లగా.. స్వరాష్ట్రంలో సర్కారు బడులకు మహర్దశ పట్టింది. విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు సంకల్పించిన తెలంగాణ ప్రభుత్వం పోటీ ప్రపంచంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సైతం నిలబడేలా తీర్చిదిద్దుతున్నది. తెలంగాణ ఏర్పాటు తర్వాత రంగారెడ్డి జిల్లాలో కొత్తగా ప్రభుత్వం 59 గురుకులాలను ఏర్పాటు చేసి కార్పొరేట్ స్థాయి విద్యను అందుబాటులోకి తెచ్చింది. అన్ని స్కూళ్లలోనూ ఇప్పటికే ఆంగ్ల బోధన జరుగుతుండగా.. తాజాగా 'మన ఊరు-మన బడి' అమలుతో ప్రభుత్వ బడుల రూపురేఖలే మారిపోతున్నాయి. జిల్లాలో తొలి విడుతలో రూ.97కోట్ల వ్యయంతో 448 పాఠశాలలకు పనులు చేపడుతున్నారు.

రాష్ట్ర ఏర్పాటుకు ముందు జిల్లాలో 21 గురుకులాలు మాత్రమే ఉండేవి. విద్యార్థుల సంఖ్య 7,300 మాత్రమే. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం 26 సోషల్ వెల్ఫేర్, 9 మైనార్టీ వెల్ఫేర్, 7 ట్రైబల్ వెల్ఫేర్, 17 బీసీ వెల్ఫేర్ గురుకులాలు, వీటితోపాటు 10 కస్తూర్బా విద్యాలయాలు, 9 ఆదర్శ పాఠశాలలు అందుబాటులోకి వచ్చాయి. వీటిల్లో కొన్నింటిలో కళాశాల స్థాయి విద్య కూడా అందుతున్నది. ప్రస్తుతం వీటిలో జిల్లావ్యాప్తంగా 20,800 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మహేశ్వరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, మహేశ్వరం, బడంగ్‌పేట్, రాజేంద్రనగర్‌లలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, మహేశ్వరం, షాద్‌నగర్‌లలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను మంజూరు చేసింది. ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగా జిల్లాలో 2014-15లో 1 నుంచి 12 తరగతుల వరకు ఉన్న విద్యార్థులు 5 లక్షల 27వేలు ఉండగా.. ఆ సంఖ్య 2022-23 సంవత్సరానికి 6 లక్షల 55 వేలకు పెరిగింది.

### మన ఊరు- మన బడితో మహర్దశ

పాఠశాల స్థాయి నుంచే పోటీ వాతావరణాన్ని తట్టుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక విధానాలను అమలు చేస్తున్నది. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధనను అందుబాటులోకి తెచ్చింది. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, డ్రెస్సులు, బస్సు సర్వీస్, మధ్యాహ్న భోజనం వంటి సేవలు ఉచితంగానే అందుతున్నాయి. తాజాగా.. ప్రభుత్వం 'మన ఊరు- మన బడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ప్రభుత్వ బడుల రూపురేఖలను మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నది. జిల్లాలో మొదటి విడతలో 464 పాఠశాలలను ఎంపిక చేయగా.. 448 పాఠశాలలను రూ.97.88కోట్ల అంచనా వ్యయంతో బాగు చేస్తున్నది. 413 పాఠశాలల్లో పనులు పురోగతిలో ఉండగా.. 11 పాఠశాలలు ఇప్పటికే కొత్త రూపును సంతరించుకుని ప్రారంభం కూడా అయ్యాయి. దశాబ్ది ఉత్సవాల్లో మరో 40 పాఠశాలలను ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.




## ఎన్నికల సామగ్రి పరిశీలన



భద్రపర్చిన ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

వికారాబాద్, జూన్ 19 : వికారాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్‌లో గల స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఎన్నికల సామగ్రిని కలెక్టర్ నారాయణరెడ్డి సోమవారం పరిశీలించారు. రాబోయే ఎన్నికల నిర్వహణ నిమిత్తం ఉపయోగించే ఈవీఎంలు, వీవీ ప్యాడ్స్, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు., తహసీల్దార్ కార్యాలయం గోడౌన్‌లో భద్రపరిచిన ఎన్నికల సామగ్రిని సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ నిమిత్తం ఉపయోగించుకునే దిశగా మెరీనాట్ స్కూల్, శ్రీఅనంతపద్మనాభ కళాశాల భవనాలను, పరిసరాలను అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, ఆర్డీవో విజయకుమారి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు.



సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి సోమవారం విశాఖ శారదాపీఠాన్ని సందర్శించారు. రాజశ్యామల అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతిస్వామిని కలిసి ఆశీస్సులు అందుకున్నారు. వచ్చే నెల 3న తాండూరులో తలపెడుతున్న రాజశ్యామల యాగం నిర్విఘ్నంగా సాగేలా దీవించాలని స్వామిని కోరారు.